క్లుప్తంగా

విద్యుత్ సరఫరాలో అంతరాయం

నకరికల్లు: విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ బి.నాగసురేష్‌బాబు శుక్రవారం తెలిపారు. పిడుగురాళ్లలోని ప్రధాన సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలకు శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం అర్ధరాత్రి 12గంటల నుంచి శనివారం ఉదయం 8గంటల వరకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేస్తామని రైతులు, వినియోగదారులు విద్యుత్ సరఫరాలో మార్పులను గమనించాలని కోరారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు



ముప్పాళ్ళ: సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామాల్లో పేకాట, కోడి పందేలు లాంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై డి.కిశోర్‌బాబు శుక్రవారం తెలిపారు. సంక్రాంతి పండగ నేపథ్యంలో ఇప్పటికే గ్రామాల్లో పటిష్ట నిఘా ఏర్పాటు చేశామన్నారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహిస్తే తగు చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామస్తులు పోలీసులకు సహకరించి గ్రామాల్లో అసాంఘిక చర్యలు జరుగుతున్నట్లుగా తెలిస్తే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. అలాంటి వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

పీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీ



పెదకూరపాడు: ప్రభుత్వ వైద్యశాలల్లో కాన్పులు ఎక్కువగా జరిగేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవి అన్నారు. మండలంలోని 75త్యాళ్ళూరు పీహెచ్‌సీని ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజలకు అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించి పలు సూచనలు చేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ కార్డులు గురించి అడిగి తెలుసుకున్నారు. వారి వెంట వైద్యాధికారి వెలుగొండరెడ్డి, సూపర్‌వైజర్ దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

జగన్మోహనాకార అలంకరణ



సత్తెనపల్లి: ధనుర్మాసం పురస్కరించుకొని పట్టణంలోని వడ్డవల్లి రామాలయం, వెంకటేశ్వరస్వామి దేవాలయం, రైల్వేస్టేషన్ రోడ్‌లోని అలివేలు మంగ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి దేవాలయం, ఐదులాంతర్ల సెంటర్‌లోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవాలయం, కట్టమూరివారి వీధిలోని కోదండ రామాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోత్రనామాలతో అభిషేకాలు నిర్వహించారు. రైల్వేస్టేషన్ రోడ్డులోని అలివేలు మంగ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రీవారికి జగన్మోహనాకార అలంకారం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకొని స్వామి కృపకు పాత్రులయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆయా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



నకరికల్లు: ఓ ద్విచక్రవాహనాన్ని మరొక ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని శాంతినగర్ వద్ద గురువారం రాత్రి జరిగింది. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రూపెనగుంట్ల గ్రామానికి చెందిన కంచేటి బ్రహ్మానందం(55) శాంతినగర్ సమీపంలోని పైపుల కంపెనీలో డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. గురువారం రాత్రి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా రూపెనగుంట్ల ఆర్చి వద్ద వేగంగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీకొట్టింది. తీవ్రగాయాలపాలైన బ్రహ్మానందం అపస్మారకస్థితిలోకి వెళ్లగా, స్థానికులు, బంధువులు నరసరావుపేటలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుని సోదరుడు కోటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ బి.ప్రసాద్ తెలిపారు.

రబీకి అందుబాటులో ఎరువులు

మాచవరం: రబీలో సాగు చేస్తున్న పంటలకు అవసరమైన ఎరువులు గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నట్లు మండల వ్యవసాయాధికారిణి కె.రామమ్మ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం నిర్వహించారు. అక్టోబర్ తర్వాత పంటలు వేసిన రైతులు ఈ-పంట నమోదు, ఈకేవైసీ చేసుకోవాలని ఆమె తెలియజేశారు. పశు సంవర్ధక శాఖ ద్వారా అందిస్తున్న ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వెటర్నరీ డాక్టర్ వెంకటేశ్వరావు తెలియజేశారు.

ఉప్పొంగిన క్రీడోత్సాహం

- హోరాహోరీగా సాగుతున్న ఆటల పోటీలు
- సత్తా చాటుతున్న ఆటగాళ్లు



కబడ్డీ ఆడుతున్న నకరికల్లు-చల్లగుండ్ల కబడ్డీ జట్ల క్రీడాకారులు

సత్తెనపల్లి: ప్రతి గ్రామంలో 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలు జోరుగా సాగుతున్నాయి. ప్రస్తుతం మండల స్థాయి పోటీలు జరుగుతుండటంతో క్రీడాకారులు ఈ పోటీలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఈ పోటీలకు కనీవినీ ఎరుగని రీతిలో విశేష స్పందన లభిస్తోంది. క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడలకు సంబంధించి ఐదు దశల్లో 47 రోజుల పాటు సాగే క్రీడల్లో మొదటి దశ పూర్తయింది. రెండో దశలో భాగంగా సత్తెనపల్లి మండలం కొమెరపూడి గ్రామంలో శుక్రవారం కబడ్డీ పోటీలు హోరాహోరీగా సాగాయి. ఈ పోటీల్లో నందిగామ-రెంటపాళ్ల జట్లు పోటీ పడగా నందిగామ జట్టు విజయం సాధించింది. ఫైనల్‌లో అబ్బూరు-నందిగామ పోటీ పడగా నందిగామ జట్టు విజయం సాధించింది. నందిగామ జట్టు సత్తెనపల్లి టౌన్ మున్సిపాలిటీ జట్టుపై ఆడాల్సి ఉంది. అలాగే సత్తెనపల్లి మండలం నందిగామ గ్రామంలో భట్లూర-దూళిపాళ్ల జట్ల మధ్య క్రికెట్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. ఈ పోటీలను మండల చీఫ్ కోచ్ ఆరిగ శ్రీరామిరెడ్డి పరిశీలించి క్రీడాకారులకు పలు సూచనలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో నోడల్ అధికారులు, పీడీలు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠభరితంగా కబడ్డీ ఫైనల్

నకరికల్లు: ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి కబడ్డీ పోటీ ఉత్కంఠభరితంగా సాగింది. నకరికల్లు-చల్లగుండ్ల జట్లు ఫైనల్‌కు చేరుకోగా రెండు జట్ల మధ్య తుదిపోరు నిర్వహించారు. ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి టాస్ వేసి మ్యాచ్‌ను ప్రారంభించారు.



సత్తెనపల్లి మండలం కొమెరపూడిలో కబడ్డీ పోటీల్లో క్రీడాకారులు

ఫిజికల్ డైరెక్టర్ చింతా పుల్లయ్య, ఈఓపీఆర్డీ గిరిధర్‌లు పోటీని పర్యవేక్షించారు. 15-15 నిమిషాల సమయంతో మ్యాచ్‌ను జరిపించారు. పోటీ ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగింది. రెండుగ్రామాల ప్రజలు ఎంతో ఆసక్తిగా తిలకించారు. గెలుపొందిన జట్టు నియోజకవర్గస్థాయికి చేరుకుంటుందని ఎంపీడీఓ తెలిపారు.

కబడ్డీలో నియోజకవర్గ స్థాయికి ఎంపికైన రాజుపాలెం

రాజుపాలెం: మండల కేంద్రంలోని ఎస్‌ఎఫ్ఎస్ పాఠశాలలో ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలలో భాగంగా కబడ్డీ పోటీలను శుక్రవారం నిర్వహించారు. ఈ పోటీలలో 14 టీంలు పాల్గొనగా రాజుపాలెం టీం ప్రథమ స్థానం సాధించి నియోజకవర్గ స్థాయిలో ఆడేందుకు ఎంపికయ్యింది. కార్యక్రమంలో ఎంపీడీవో టి.శ్రీనివాసరావు, ఎంఈవో మల్లిఖార్జున శర్మ, గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో జట్టుపై తహసీల్దార్ జట్టు విజయం

ముప్పాళ్ళ: ఆడుదాం ఆంధ్రాలో భాగంగా తహసీల్దార్ జట్టు, ఎంపీడీవో జట్టు మధ్య క్రికెట్ పోటీ శుక్రవారం నిర్వహించారు. ఈ పోటీలో ఎంపీడీవో జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 82 పరుగులు సాధించింది. ఆ తర్వాత బ్యాటింగ్ చేపట్టిన తహసీల్దార్ జట్టు 9 ఓవర్లకే 82 పరుగులు సాధించి విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో తహసీల్దార్ జట్టుకు చెందిన వీఆర్వో జాన్‌హుస్సేన్ 30 పరుగులతో పాటు రెండు వికెట్లు తీసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ సాధించారు. తహసీల్దార్ జట్టుకు ముప్పాళ్ళ వీఆర్వో అశోక్, ఎంపీడీవో జట్టుకు మాదల వెల్ఫేర్ అసిస్టెంట్ నాగబాబులు అధ్యక్షులుగా వ్యవహరించారు. విజేతలకు తహసీల్దార్ భవానిశంకర్, ఎంపీడీవో పుట్టారెడ్డిలు ట్రోఫీ అందించారు.



విజేతలను అభినందిస్తున్న తహసీల్దార్ భవానిశంకర్, ఎంపీడీవో పుట్టారెడ్డి

ప్రజల ఆరోగ్య సంరక్షణే ఆరోగ్య సురక్ష లక్ష్యం



తొండపిలో ఆరోగ్యసురక్ష శిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి

తొండపి(ముప్పాళ్ళ): ప్రజలందరికీ ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహిస్తుందని, ప్రజలు సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.రవి చెప్పారు. మండలంలోని తొండపి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని శుక్రవారం సందర్శించారు. మొత్తం 237 మందికి వైద్య సేవలందించినట్లు పీహెచ్‌సీ వైద్యులు వి.జయకృష్ణ తెలిపారు. వీరిలో 15 మందికి కంటి పరీక్షలు అనంతరం కళ్ళజోళ్ళు అందించామన్నారు. కార్యక్రమంలో వైద్యులు సుధీర్‌కుమార్, బదరీనారాయణలు వైద్య సేవలందించారు. గ్రామ సర్పంచ్ బోరుపోతు సుశీల, జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్, సీహెచ్‌ఓ ఆంజనేయులు, సూపర్‌వైజర్ జోస్పిన్‌రాణి, పీటర్‌డేమియన్, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కండ్లకుంటలో జగనన్న ఆరోగ్య సురక్ష

నకరికల్లు: మండలంలోని కండ్లకుంట గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్యశిబిరం విజయవంతంగా నిర్వహించారు. డాక్టర్ పూజశ్రీ, డాక్టర్ ధర్మానాయక్, డాక్టర్ సౌజన్య తదితరులు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యులు మాట్లాడుతూ వైద్య శిబిరంలో సుమారు 271మందికి వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో మాజీ సొసైటీ అధ్యక్షుడు కంఠమనేని కోటయ్య, ఉపసర్పంచ్ కంఠమనేని చందు, కార్యదర్శి సత్యనారాయణ, గాలి చంద్రయ్య, చట్టి అప్పయ్య వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

దొడ్లేరులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

దొడ్లేరు(క్రోసూరు): రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ముంగిటికే వైద్యం అనే విధానంతో అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమం మండలంలోని దొడ్లేరు-1 సచివాలయంలో శుక్రవారం నిర్వహించారు. రోగులకు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందించారు. 200 మందికి పైగా వైద్య సేవలు అందించారు. 14 మంది కంటి చూపు లోపం ఉన్నవారికి ఉచిత అద్దాలను పొందేందుకు సిఫార్సు చేశారు. డాక్టర్ సిరి చందన, డాక్టర్ రాజేష్ వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహేష్ బాబు ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్, సర్పంచ్ ముక్కు అంజలి, ఎంపీటీసీ కె.నాగయ్య, పంచాయతీ సెక్రటరీ వెంకయ్య, హెల్త్ సూపర్‌వైజర్ అమరజ్యోతి, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు భులక్ష్మి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా కూడారై మహోత్సవం



కారెంపూడి: స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి ఆలయంలో శుక్రవారం ఆండాళ్ అమ్మవారికి కూడారై మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మహిళలు అమ్మవారికి కూడారై పాత్రలలో నైవేద్యాన్ని సమర్పించారు. విష్ణు సహస్రనామాలతో పాటు వివిధ సహస్ర నామాలు పఠించారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు వీర్లవరప్రసాదరావు, రామిరెడ్డి, ఈవో కృష్ణంరాజు పాల్గొన్నారు.

విజయపురిసౌత్: స్థానిక సీతారామాలయంలో ధనుర్మాసం పురస్కరించుకొని శుక్రవారం కూడారై మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు 108 కలశాలతో గోదాదేవి అమ్మవారికి క్షీరాన్నం నివేదించి 5 అష్టోత్తరాలతో పూజలు నిర్వహించారు. విశేష పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

బెల్లంకొండ: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం రాత్రి మండలంలోని నాగిరెడ్డిపాలెం గ్రామంలోని విజ్‌డమ్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, వసంతకుమారి ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ముందుగా మధ్యాహ్నం 3 గంటలకు వివిధ గ్రామాలకు చెందిన మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో దాదాపుగా 400 మంది మహిళలు పాల్గొన్నారు. సంక్రాంతి సంబరాలలో ముందుగా ఎమ్మెల్యే సతీమణి వసంతకుమారి, తనయుడు కళ్యాణ్ చక్రవర్తి, ఎంపీపీ పద్మా వెంకటేశ్వరరెడ్డి భోగి మంటలు వెలిగించారు. అనంతరం సంప్రదాయ ఆట కోడి పోరును ప్రారంభించారు. వసంతకుమారి మాట్లాడుతూ పండిన పంట ఇంటికి చేరిన సమయంలో రైతులు ఎంతో ఆనందంగా చేసుకునే పండుగ సంక్రాంతి అని అన్నారు. జగనన్న పాలనలో ప్రతి కుటుంబం సంతోషంగా ఉందన్నారు. మంచి చేస్తున్న ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ అండగా ఉండాలని కోరారు. అనంతరం ముగ్గుల పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చెన్నపరెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ షహనాజ్ బేగం అహ్మద్ పాషా, సర్పంచ్ గంగిరెడ్డి హనుమాయమ్మ, ప్రతాపరెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సతీమణి వసంతకుమారి

భట్లూరు, గుజ్జర్లపూడిలో గ్రామోదయం

సత్తెనపల్లి: గ్రామీణ ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యంగా ఉంటారని మండల ప్రత్యేక అధికారి ఏ సుధాకర్ అన్నారు. సత్తెనపల్లి మండలం భట్లూరు, గుజ్జర్లపూడి గ్రామాల్లో గ్రామోదయంలో భాగంగా శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా కాఫీ విత్ క్లాప్ మిత్రలతో సమావేశమయ్యారు. వారి సమస్యలు తెలుసుకొని వారితో కలిసి కాఫీ తాగారు. వారిని శాలువాలతో సత్కరించారు. రక్తహీనత కలిగిన బాలికలు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. జగనన్న ఆరోగ్య సురక్షలో వైద్య సేవలు పొందిన వారి ఆరోగ్య స్థితులను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఓటరు జాబితాలో వికలాంగులను గుర్తించి వారు పోలింగ్ స్టేషన్‌కు రాలేని పరిస్థితి ఉంటే ఇంటి వద్దకే ఓటు వేసేందుకు పంపే ఏర్పాట్లపై పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి స్వచ్ఛంద సంస్థలు అందించే ఆట పరికరాలు పెట్టుకునేందుకు అనువైన స్థలాలు ఉన్నాయా లేవా అని పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీవో జీవీ సత్యనారాయణ, పణిదం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ యూఎస్ఎల్ కవిత, మండల విద్యాశాఖ అధికారి ఏ శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆషా, పంచాయతీ సెక్రటరీ సత్యనారాయణ, తదితరులున్నారు.



గ్రామోదయంలో మండల ప్రత్యేక అధికారి సుధాకర్, సత్యనారాయణ, శ్రీనివాసరావు

దోమల నివారణపై అవగాహన



13వ వార్డులో ఇంటింటికి పర్యటిస్తున్న పల్నాడు జిల్లా మలేరియా అధికారి రత్నాకర్

సత్తెనపల్లి: నీటి నిల్వలు దోమలకు పుట్టినిల్లు అని ఇంటి లోపల బయట పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని పల్నాడు జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్ అన్నారు. ఫ్రైడే డ్రైడే లో భాగంగా పట్టణంలోని వడ్డవల్లి పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలోని 13వ సచివాలయం పార్క్ ఏరియాలోని వివిధ ప్రాంతాల్లో ఇంటింటికి తిరిగి శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దోమల వలన మలేరియా, డెంగ్యూ, చికెన్ గునియా, మెదడువాపు, బోదకాలు వంటి వ్యాధులు వ్యాప్తి చెందుతాయన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో సచివాలయ ఆరోగ్య సిబ్బంది, శానిటరీ సిబ్బంది, మలేరియా సిబ్బంది పాల్గొని ఇంటింటికి తిరిగి దోమలు వృద్ధి చెందకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రజల భాగస్వామ్యం తప్పనిసరన్నారు. కార్యక్రమంలో పట్టణ మలేరియా సూపర్‌వైజర్లు బి.రోశయ్య, వై.రాజేష్ పాల్, హెల్త్ అసిస్టెంట్లు, హెల్త్ సెక్రటరీలు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

రాజుపాలెం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో టి.శ్రీనివాసరావు సూచించారు. రాజుపాలెం, బ్రాహ్మణపల్లిలో వికసిత భారత సంకల్ప యాత్ర శుక్రవారం నిర్వహించారు. యాత్రలో సంక్షేమ పథకాల గురించి కోఆర్డినేటర్ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. పీహెచ్‌సీ వైద్యాధికారి రవితేజనాయక్ మాట్లాడుతూ వైద్య, ఆరోగ్య శాఖకు సంబంధించిన పథకాల గురించి వివరించారు. వికసిత భారత సంకల్ప యాత్ర క్యాలెండర్లను, పోస్టర్లను విడుదల చేశారు. సర్పంచ్ పులిబండ్ల అశోక్, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఈవోపీఆర్‌డీ ముక్కంటి, హెల్త్ సూపర్‌వైజర్లు జీవన్‌రావు, ఉషారాణి, ఎమ్‌హెచ్‌పీ దేవా నాయక్, ఏపీవో సీహెచ్ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

సంక్రాంతి ముగ్గుల పోటీ

మాచర్ల: పట్టణంలోని రోటరీ క్లబ్, కేసీపీ వారి ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీలను శుక్రవారం కేసీపీ ఆఫీసర్స్ కాలనీలో నిర్వహించారు. ముగ్గుల పోటీలు కేసీపీ జీఎం వెంకటరమణ ప్రారంభించి మాట్లాడుతూ రోటరీ క్లబ్, తమ సంస్థ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించటం ఎంతో అభినందనీయమన్నారు. మహిళలు భారీ స్థాయిలో ముగ్గుల పోటీలో పాల్గొన్నారు. అనంతరం గెలుపొందిన మహిళలకు బహుమతులు అందించారు. డాక్టర్ రామకోటయ్య, తదితరులున్నారు.

యువతకు ఆదర్శం వివేకానందుడు

- రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- ఘనంగా స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలు



పట్టణంలో స్వామి వివేకానంద చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: స్వామి వివేకానంద యువతకు ఆదర్శమని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. నవచైతన్య వివేకా సేవా సమితి సత్తెనపల్లి వారి ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన రహదారిలో స్వామి వివేకానంద విగ్రహం వద్ద శుక్రవారం వివేకానంద జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉత్సవాలకు నవచైతన్య వివేకా సేవా సమితి అధ్యక్షుడు నోముల వెంకట చలపతిరావు అధ్యక్షత వహించారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ వేదాంత విలువలను భారతదేశానికే కాకుండా అమెరికా, ఇంగ్లాండ్ లాంటి ప్రపంచ దేశాలకు కూడా తన ఉపన్యాసాల ద్వారా పరిచయం చేసిన మహోన్నతుడు స్వామి వివేకానందుడు అన్నారు.

సభలో ప్రొద్దుటూరు తెలుగు విశ్రాంత ఆచార్యులు సూరం నారాయణరెడ్డి, గుంటూరు ఆధ్యాత్మిక సందేశకులు, వాస్తు జాతక సిద్ధాంతి కూరపాటి సాంబశివరాజు, నవచైతన్య వివేకా సేవా సమితి కార్యదర్శులు దివ్వెల శ్రీనివాసరావు, విప్పర్ల పాండురంగారావులు మాట్లాడారు. ముందుగా స్వామి వివేకానంద చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా అన్న సంతర్పణ నిర్వహించారు. పేదలకు దుప్పట్లు, విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. పలువురు ఉత్తమ పారిశ్రామికవేత్తలను సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, నవచైతన్య వివేకా సేవా సమితి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

వివేకానందుడి బోధనలే భవిష్యత్ తరాలకు స్ఫూర్తి



వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరారవు

అమరావతి: మానవ జీవితం ఆధ్యాత్మికతతో ముడిపడి ఉందని, యుక్త వయస్సులోనే తన బోధనలతో యువతలో స్ఫూర్తిని రగిలించిన మహనీయుడు స్వామి వివేకానందుడని పెదకూరపాడు శాసనసభ్యుడు నంబూరు శంకరరావు అన్నారు. శుక్రవారం స్థానిక బస్టాండ్ సెంటర్లో సరస్వతి శిశు మందిరం ఆధ్వర్యంలో నిర్వహించిన వివేకానందుని జయంతిని పురస్కరించుకుని వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం మాట్లాడుతూ భారతీయ సంస్కృతి సంప్రదాయాలను ప్రపంచవ్యాప్తం చేసిన స్వామి వివేకానంద భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలుస్తాడన్నారు. తొలుత సరస్వతి శిశుమందిరం విద్యార్థులు వివేకానందుని చిత్రపటంతో, ఆయన బోధనలను నినదిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండు సెంటర్‌లోని వివేకానందుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జీడీసీసీబ్యాంక్ డైరెక్టర్ కోట హరిబాబు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు, జేసీఎస్ అధ్యక్షుడు నాయుడు రాంబాబు, మాదాసు రాంబాబు, శివపార్వతి మాతాజీ, ప్రధానోపాధ్యాయుడు కోలా వెంకటేశ్వరరావు విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

క్రోసూరుకు చేరుకున్న 'జగనన్నకు థ్యాంక్స్ యాత్ర'



మాట్లాడుతున్న జయకుమార్

క్రోసూరు: ఈనెల 19న విజయవాడ స్మృతివనంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా 125 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరుతూ జగనన్న రాష్ట్ర అభిమాన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కావూరి జయ్‌కుమార్ ఒంగోలు నుంచి చేపట్టిన థ్యాంక్స్ యాత్ర ఏడవ రోజు శుక్రవారం క్రోసూరు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయనను వైఎస్సార్‌సీపీ యువనాయకుడు, ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తనయుడు కల్యాణ్‌బాబు, మండల నాయకులు కలుసుకున్నారు. థ్యాంక్స్ యాత్ర క్రోసూరు చేరుకున్నందుకు నంబూరు కల్యాణ్‌బాబు, పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి రాష్ట్ర ప్రజలందరి తరపున థ్యాంక్స్ చెబుతూ ఈ యాత్ర ప్రారంభించినట్లు జయకుమార్ తెలిపారు. జయకుమార్‌ను కలుసుకున్న వారిలో రాష్ట్ర వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ కార్యదర్శి గార్లపాటి దాసు, దాసయ్య, ఎంపీపీ పి.కోటయ్య, జెడ్పీటీసీ సభ్యులు షేక్ జమీలాగపూర్, పీఏసీఎస్ అధ్యక్షుడు అనుముల కోటిరెడ్డి, తిప్పిరెడ్డి అప్పిరెడ్డి, మండల వైఎస్సార్సీపీ అధ్యక్షుడు వెలది అప్పారావు, షుకూర్ తదితరులున్నారు.

కరాటే క్రీడాకారునికి ప్రోత్సాహం



పట్టణంలోని 24వ వార్డులో ధనుంజయ్‌కు గౌరవ వేతనం అందిస్తున్న అచ్యుత శివప్రసాద్

సత్తెనపల్లి: పట్టణంలోని 24వ వార్డు కౌన్సిలర్, వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్ పురపాలక సంఘం నుంచి ప్రతి నెలా అందే గౌరవ వేతనాన్ని పేదవర్గాలకు అందించి వారిని ఆర్థికంగా ప్రోత్సహిస్తున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం పట్టణానికి చెందిన అనుముల ధనుంజయ్ కరాటేలో జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. అనుముల ధనుంజయకు ఆయన తన గౌరవ వేతనాన్ని అందించి ప్రశంసించారు. అలాగే 24వ వార్డుకు చెందిన చింతల వెంకటలక్ష్మి, వెంకట నరసమ్మ, భవానిలకు తన గౌరవ వేతనం అందించి ఆర్థికంగా ప్రోత్సాహాన్ని అందించారు. తన గౌరవ వేతనం పేద వర్గాలకు అందించి ఆర్థికంగా ప్రోత్సాహానిస్తున్న అచ్యుత సేవలను పలువురు ప్రశంసించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కోటేశ్వరరావు, పాపారావు, వర్ధరావు, నరసింహారావు, జగన్‌మోహన్‌రావు, సాయి మహేష్, రామారావు, శివసాయి, తదితరులున్నారు.